లలిత - ఆది

తలగరో లోకులు - తడయకురో మము
కలిగినదిది మా - కాపురము

నరహరి కీర్తన - నానిన జిహ్వ
నొరుల నుతింపగ - నోపదు జిహ్వ
మురహరు పదముల - మొక్కిన శిరము
పరుల వందనకు - బరగదు శిరము

శ్రీపతినే పూ - జించిన కరములు
చోపి యోచనకు - జొరవు కరములు
యేపున హరికడ - కేగిన కాళ్ళు
పాపుల యిండ్లకు - బారవు కాళ్ళు

శ్రీ వేంకటపతి - జింతించు మనసు
దావతి నితరము - దలచదు మనసు
దేవుడతని యా - ధీనపు తనువు
తేవల నితరా - ధీనము గాదు

జనులందరూ దారి తొలగండి మాకు. మమ్ము వేధించకండి. మాకు సిద్ధించిన జీవన విధానమిదే.

నరహరి కీర్తనలో నానిన మా నాలుకలు పరుల నుతింపజాలవు. నరసింహుని కీర్తించే మా రసనం నరులను కీర్తింపదు. మురహరుని చరణాల వ్రాలి మ్రొక్కే మా తల పరుల పాదాలకు వ్రాలదు, వంగదు.

శ్రీపతినే మా హస్తాలు అభ్యర్థించగలవు. శ్రీరమణుని పూజించే మా చేతులు యాచనకు దిగజారవు. శ్రీమహావిష్ణువంతటివాడు మేమొనర్చిన షోడశోపచార పూజలు స్వీకరిస్తాడు. అప్పుడు గూడా మా చేయి పైనే ఉంటుంది. అటువంటి మా చేతులు యాచనకై నరుల ముందుకు సాగుతాయా? సాగవు. పరమోత్సాహంతో హరి వద్దకు భూలోక వైకుంఠమైన తిరుమలపై వెలసిన శ్రీనివాసుని వద్దకు పరుగు పెట్టే మా పాదాలు పాపుల యిళ్ల దిక్కుగా ఒక అడుగు కూడా వేయవు.

శ్రీ వేంకటేశ్వరుని అహర్నిశలూ 'పానీయంబులు ద్రావుచున్ కుడుచుచున్, భాషిం చుచున్ హసలీలా నిద్రాదులు సేయుచున్ ఏయే వేళల ఏయే కర్మలొనరిస్తే ఆయా వేళ ల ఆయా పూజలని శ్రీహరికి కాగలవని, చింతింతే మనసు ఇతర విషయాసక్తికి లోను గాజాలదు. పరమేశ్వరుడైన ఆ తిరువేకంటేశ్వరుని అధీనమైన మాధనమాన ప్రాణ మనోవాక్కులన్నీ ఆ స్వామికే ఏనాడో సమర్పితం. అటువంటి తనువు ఇతరుల అధీనం ఎన్నటికీ కాదు. ఎవరికీ మాపై అధికారం లేదు. అన్న అన్నమాచార్యుల ఈ సంకీర్తన విని రాయలు ఆగ్రహించి మూరురాయరగండ ముద్రగల సంకెల వేయించి ఆచార్యులవారి ని మొగసాలలో కూర్చోబెట్టాడు.

ఆ రాజు పాపం అజ్ఞాని.

విశ్వేశ్వర మజం దేవం జగతః ప్రభుమవ్యయం
భజన్తియే పుష్కరాక్షం నతే యాన్తి పరాభవం
నతేయాన్తి పరాభవం ఓంనమన్నతి

అనీ, విష్ణు భక్తులకు పరాభవం ఉండదనీ అప్పటికింకా అతనికి తెలియలేదు.